# మోడీ – బాబుల జోడీతో మునుగుతున్న పట్టణాలు

# పౌర సదుపాయాలకై ఉద్యమించండి




## భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ

# మోడీ - బాబుల జోడీతో మునుగుతున్న పట్టణాలు

# పౌర సదుపాయాలకై ఉద్యమించండి

**అ**సెంబ్లీ, పార్లమెంట్, మున్సిపల్ ఎన్నికలు ముగిసి 14 నెలలు గడిచాయి. ఎన్నికలలో బి.జె.పి., తెలుగుదేశం పార్టీలు వాగ్ధానాల వర్షం కురిపించారు. పాలకులు మారారు. పథకాల పేర్లు మారుతున్నాయి. స్మార్ట్‌నగరాలు, మెగాసిటీలు, మురికివాడలు లేని పట్టణాలు 2022 నాటికి అందరికీ ఇళ్ళు అంటూ పాలకులు ఊదరగొడుతున్నారు. ప్రపంచం అంతా మన వైపే చూసే రీతిలో రాష్ట్రంలో రాజధాని నిర్మాణం చేస్తానని ముఖ్యమంత్రి గొప్పలు చెబుతున్నారు. అరచేతిలో స్వర్గం చూపిస్తున్నారు.

సంస్కరణలపేరుతో పట్టణాలలో మార్పు తేవటం 25 సంవత్సరాల క్రితమే ప్రారంభమైంది. పాలకులు మారుతున్నా పట్టణాలలో సంస్కరణలు అమలు చేయటం మానలేదు. పాలకులు మారే కొద్ది క్రొత్త క్రొత్త పేర్లతో సంస్కరణలు అమలు చేస్తూనే వస్తున్నారు. అప్పులు తెచ్చి ప్రపంచబ్యాంకు నిధులతో ప్రపంచస్థాయి నగరాలు నిర్మిస్తామని ప్రగల్భాలు పలికారు. పట్టణాల రూపురేఖలే మారిపోతున్నాయి. కానీ వాస్తవ పరిస్థితి ఏమిటి?

రాష్ట్రాన్ని చీల్చారు. కొత్తరాష్ట్రంలో 111 మునిసిపాలిటీలు, కార్పొరేషన్లు ఉన్నాయి. 30శాతం మంది పట్టణాలలో బతుకుతున్నారు.

**ఏ పట్టణం చూసినా ఏమున్నది గర్వకారణం ....?**



(1) మన పట్టణాలు బాగుపడాలి. ప్రపంచస్థాయి పట్టణాలతో పోటీ పడాలి. పెట్టుబడిదారులను, పర్యటకులను ఆకర్షించాలంటూ తియ్యటి కబుర్లు చెప్పారు. ఇదంతా జరగాలంటే మౌలికసదుపాయాలు(విమానాశ్రయాలు, హొటళ్ళు, విశాలమైన రోడ్లు, ఫ్లైఓవర్లు, జిగేల్‌మనే లైట్లు (ఇంకాఎన్నో) కావాలి. లక్షల కోట్ల డబ్బు కావాలి. ప్రభుత్వం దగ్గర డబ్బులేదు. మునిసిపాలిటీలు దివాళాతీసి ఉన్నాయి. కాబట్టి అప్పులు తప్పవన్నారు. ప్రపంచబ్యాంకు ఇతర ఆర్థిక సంస్థలే దిక్కు అని సెలవిచ్చారు. అప్పు ఇవ్వాలంటే వారు విధించే షరతులు అంగీకరించాల్సిందేనని నమ్మబలికారు. ఆ షరతులకు సంస్కరణలని ముద్దు పేరు పెట్టారు. ప్రపంచబ్యాంకుతో పాటు కేంద్రప్రభుత్వ స్కీమ్‌లు పెట్టింది. వారు రాష్ట్రాలకు, మున్సిపాలిటీలకు అదే షరతులను కొత్త రూపంలో మెలికలు పెట్టారు.

(2) మునిసిపాలిటీలు ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నాయి. ప్రజాఫిర్యాదులు పట్టించుకునే నాధుడు లేదు. ఆన్‌లైన్, ఆదాలత్‌లు ఎన్ని పెట్టినా సమస్యలు పరిష్కారానికై సామాన్యుడు చెప్పులు అరిగేలా తిరగకతప్పడం లేదు. అవినీతి పెచ్చరిల్లింది. పన్నుల మోత మోగుతున్నాయి. స్పెషలాఫీసర్ పాలన ముగిసి ఎన్నికలు జరిగి కొత్త కౌన్సిళ్ళు వచ్చినా, కేంద్రం, రాష్ట్రంలో పాలకులు మారినా ప్రజల “తలరాత” మారలేదు. పెనం మీద నుండి పొయ్యిలోకి పడ్డట్టుంది.

(3) సొంత ఇల్లు లేక, అద్దెలు భరించలేక పేద,మధ్యతరగతి ప్రజలు సతమతమవుతున్నారు. పేదలు ఆక్రమణ స్థలాల్లో దశాబ్దాల నుండి ఉన్నా పట్టాలు లేవు. కనీస సౌకర్యాలు లేవు.

(4) ట్రాఫిక్ నరకం చూపిస్తోంది. గతుకుల రోడ్లు పరీక్ష పెడుతున్నాయి. మంచినీటి సరఫరా అరకొరే. చిన్న వర్షాలకే పట్టణాలు చెరువులుగా మారుతున్నాయి. డ్రైనేజీవ్యవస్థ అస్తవ్యస్థంగా ఉంది. పారిశుధ్య స్థితి దిగజారింది. దోమలు చెండాడుకు తింటున్నాయి. డంపింగ్ యార్డులు లేక పట్టణాలు మురికి కంపు కొడుతున్నాయి. ఆసుపత్రుల నిర్వహణ అధ్వాన్నంగా వుంది. పార్కులు, రీడింగ్‌రూములు, కళ్యాణమండపాలు, కమ్యూనిటీహాల్స్,విజ్ఞాన, వినోద కార్యక్రమాలు అత్యాశగానే మిగిలిపోతున్నాయి. మురికి వాడలలో మురికి తొలగించకపోగా మురికివాడలనే లేపేస్తున్నారు. కాలనీలు ఏర్పడి ఎన్నో ఏళ్ళు గడచినా సమస్యల నిలయాలుగానే ఉంటున్నాయి.

(5) మునిసిపల్ మంత్రి నారాయణ మునిసిపల్ శాఖను, పరిపాలనను గాలికొదిలేశారు. రాజధాని భూములు సమీకరించే పనిలో బిజీగా వున్నారు. తన వ్యాపార అనుభవంతో

మంత్రాంగం నడుపుతున్నారు. పట్టణాలు, నగరాల అభివృద్ధి పట్టడం లేదు.

(6) 25 సంవత్సరాలు సంస్కరణల విధానాలు అమలు జరిగిన తరువాత పరిస్థితి ఇది. చెప్పింది ఏమిటి? జరిగింది ఏమిటి. ఎందుకిలా జరిగింది !

**మారిన పాలకులు–మారని విధానాలు**

1995 నుండి 2004 వరకు చంద్రబాబు పాలనలో విజన్ 2020, బ్రిటీష్ ఆర్థిక సంస్థ డి.ఎఫ్.ఐడి. పథకం, కాంగ్రెస్ పాలన (రాజశేఖరరెడ్డి పాలన)లో ప్రపంచ బ్యాంకు ఆదేశాలతో ఎ.పి.యు.ఆర్.ఎం.ఎస్.పి., ఎ.పి.ఎం.డి.పి. పథకాలు వచ్చాయి. కేంద్రంలో కాంగ్రెస్ పాలనలో జె.ఎన్.ఎన్.యు.ఆర్.ఎం., ఇప్పుడు బిజెపి పాలనలోపేర్లు మార్చి స్మార్ట్‌నగరాలు" అమృత్" స్కీమ్‌లు పెట్టారు. పేర్లు మారినా వాటన్నింటిలో సారం ఒక్కటే.

1. పట్టణ సదుపాయాల ప్రైవేటీకరణ–వ్యాపారీకరణ (పి.పి.పి., ప్రైవేటీకరణ)
2. స్థానిక సంస్థలకు రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు కుదించడం, నిలిపివేయడం.
3. ప్రతిపనికి రేటుకట్టి యూజర్‌చార్జీలు, ఇతర పన్నుల రూపంలో ఖర్చు మొత్తం రాబట్టడం.
4. సబ్సిడీలను కుదించడం.
5. చార్జీలు, పన్నులు నిర్ణయించడానికి రెగ్యులేటరీ కమిషన్‌లు ఏర్పాటు చేయడం.
6. చట్టాలు, నిబంధనలు మార్చడం.
7. పట్టణ మౌలిక సదుపాయాలలోకి విదేశీప్రత్యక్ష పెట్టుబడులను అనుమతించడం.

ఈ విధానాలు, సంస్కరణలు, షరతుల అమలు వలన మొదట్లో కష్టాలున్నా రోజులు గడుస్తున్న కొద్దీ అంతా సుఖమేనని నమ్మించారు. సంవత్సరాలు గడచినా దుష్ఫలితాలే తప్ప సత్ఫలితాలు లేవు. అభివృద్ధి ఫలాలు కొద్ది మందికే తప్ప అత్యధిక మందికి అందడం లేదు.

– ఇప్పటికే వున్న పన్నులు పెంచారు. కొత్తరకాల పన్నులు, చార్జీలు విధించారు. ఇల్లు ఉంటే పన్ను, ఖాళీ స్థలాలు వున్నా వేకెండ్ లాండ్ టాక్స్ పేరుతో పన్ను పోటు తప్పడం లేదు. మంచినీరు, డ్రైనేజీ చార్జీలు పెరిగి తడిసిమోపెడయ్యాయి. ఆఖరుకు చెత్తమీద కూడా పన్ను విధించారు. పార్కుల్లో ప్రవేశించడానికి ఫీజులు, పార్కింగ్ ఫీజులు, జిమ్‌లు, స్విమ్మింగ్‌పూల్స్, కళ్యాణమండపాలు అన్నింటినీ ఆదాయం గడించే సాధనాలుగా మార్చేశారు. ట్రేడ్‌లైసెన్స్‌లు, అడ్వర్‌టైజ్‌మెంట్ టాక్స్‌ల పేరుతో చిన్న, మధ్యతరగతి వ్యాపారులను దండుకున్నారు. పన్నులు ఆలస్యమైతే నెలకు 2/– వడ్డీకూడా వసూలు చేస్తున్నారు.

– అక్టోబర్ నుండి అన్ని పట్టణాలలో ఆస్తిపన్ను(ఇంటిపన్ను) పెంచడానికి రంగం సిద్ధం చేస్తున్నారు. పౌరసదుపాయాల కల్పనలో లాభ,నష్టాలు లెక్కించి అయిన ఖర్చు మొత్తం ప్రజల నుండి రాబడుతున్నారు. అన్ని పట్టణాలలో అన్ని పన్నులు ఒకేసారి కాకుండా

విడివిడిగా ఒకొక్కసారి పెంచుతూ ప్రజల కళ్ళుగప్పుతున్నారు. మున్సిపాలిటీలను ప్రజలకు సేవలు అందించే సంస్థలుగా కాకుండా పక్కా వ్యాపార సంస్థలుగా మార్చేస్తున్నారు.

**ప్రతిపనీ ప్రైవేట్‌కే - ప్రజాసొమ్ము దిగమింగేందుకే**




ప్రైవేటీకరణ జోరుగా సాగుతోంది. పారిశుధ్యం నిర్వహణ కాంట్రాక్టర్ల పరమైంది. స్వచ్ఛఆంధ్ర కార్పొరేషన్ ఏర్పాటు చేసి సింగపూర్‌తో ఒప్పందం చేసుకుని ఘనవ్యర్థ పదార్థాల (సాలిడ్ వేస్ట్‌మేనేజ్‌మెంట్) పేరుతో చెత్త నుండి విద్యుత్ తయారీ అని చెప్పి రాష్ట్రం మొత్తం హోల్‌సేల్‌గా పారిశుధ్య నిర్వహణను బడాకంపెనీలకు కట్టబెట్టే కుట్రలు సాగుతున్నాయి.

ట్యూబ్‌లైట్లు తీసి ఎల్.ఇ.డి. బల్బులు వేసే కాంట్రాక్టును బడాకంపెనీలకు అప్పగించారు. రాష్ట్రప్రభుత్వమే ఇందుకు జీవో 74 విడుదల చేసింది. స్థానిక సంస్థలతో సంబంధం లేకుండా ప్రభుత్వ ఆదేశాలతో కమీషనర్లు ఒప్పందాలు చేసుకుంటున్నారు. వీధిలైట్ల నిర్వహణ మొత్తం ప్రైవేట్ సంస్థల పరమవుతున్నది. పార్కులు, కళ్యాణమండపాలు లీజుకిచ్చేస్తున్నారు. ఆఖరికు కర్మకాండలు నిర్వహించుకునే కర్మలభవనాలను కూడా విడిచిపెట్టకుండా వాటినీ ప్రైవేట్ సంస్థలకు కట్టబెడుతున్నారు. మంచినీటి సరఫరాను కొన్ని నగరాలలో బడా కంపెనీలకు దారదత్తం చేయడానికి పథకాలు రూపొందిస్తున్నారు. ప్రభుత్వ స్థలాలను తెగనమ్ముతున్నారు. లీజుపేరుతో కోటీశ్వరులకు కట్టబెడుతున్నారు. విశాఖలో జూపార్కును తరలించే కుట్రలు ఆ కోవలోనే అన్నింటికీ పి.పి.పి (పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్) అని ముద్దుపేరు పెట్టి ప్రైవేట్ దోపిడీని యదేచ్ఛగా సాగిస్తున్నారు. సర్వం ప్రైవేట్ పరమవుతున్నాయి. సదుపాయాలు కుదించబడుతున్నాయి. పౌరసేవల బాధ్యతల నుండి మునిసిపాలిటీలు, ప్రభుత్వాలు తప్పుకుంటున్నాయి. ప్రజల డబ్బు దుర్వినియోగం మవుతోంది. అవినీతి చట్టబద్ధమవుతోంది. ప్రైవేటీకరణ దొంగల దోపిడీగా మారింది. నేతలకు, ప్రజాప్రతినిధులకు కల్పవృక్షంగా తయారయింది.

**బతికినా ప్రైవేటే - చచ్చినా ప్రైవేటే**

**-బ్రతికినన్నాళ్ళు ప్రైవేట్‌వాళ్ళ సేవలు తప్పవు. మంచినీరు మొదలు మరుగుదొడ్ల**

వరకు సర్వం ప్రైవేట్‌పరమే. చనిపోతే దహనంచేసే స్మశాన వాటికలు ప్రైవేట్‌వి వచ్చేశాయి. కొన్ని ముఖ్యనగరాలు, పట్టణాలలో స్వచ్ఛంద సంస్థలు, పెద్దలు కలిపి విరాళాలతో ప్రైవేట్‌గా అందమైన స్మశానవాటికలు ఏర్పర్చారు. విరాళాలు ఇచ్చినవారి ఉద్ధేశ్యం మంచిదే కావచ్చు.

– స్మశానాల అభివృద్ధి బాధ్యత నుండి స్థానిక సంస్థలు క్రమంగా తప్పుకుంటున్నాయి.

– స్మశాన నిర్వహణ ఎవరు చేయాలి? ప్రైవేట్ సంస్థలే చేయాలి. నిర్వహణ ఖర్చులు కావాలి. అందుకు స్మశానాలలో ఫీజులు వచ్చేశాయి. దహనానికి రూ॥2000 నుండి రూ॥5000 వరకు వసూలు చేస్తున్నారు. పేదవారు చెల్లించలేకపోతే వారికి ప్రభుత్వస్మశానాలే గతి.

– చనిపోయిన తరువాత దహన సంస్కారాల్లోనూ అసమానతలు తప్పవా? లోక్లాస్ స్మశానాలు, హైక్లాస్ స్మశానాలు అని తేడాలు ఏమిటి?

**దివాళాతీస్తున్న మునిసిపాలిటీలు**

– సంస్కరణల వలన ఆర్థిక స్వతంత్రత చేకూరి పరిపుష్టమవుతాయని చెప్పిన మాటలు పచ్చి అబద్దాలని కాలం రుజువు చేస్తోంది. ప్రపంచబ్యాంకు, ఇతర సంస్థల నుండి తెచ్చిన అప్పులు కట్టలేక మునిసిపాలిటీలు దివాళా తీస్తున్నాయి. కేంద్రం ఇచ్చే పథకాలలో 30 నుండి 50శాతం స్థానిక సంస్థలు భరించాలని నిబంధన పెట్టడంతో ఆ నిధులు సమకూర్చుకోవడం దుర్లభమవుతోంది. ప్రైవేట్ దోపిడీతో ఖజానా ఖాళీ అవుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చట్టబద్ధంగా మునిసిపాలిటీలకు ఇవ్వవలసిన నిధులు ఇవ్వకుండా తొక్కిపెడుతున్నాయి. సిబ్బంది వేతనాలు తామే చెల్లిస్తామని చెప్పి గ్రాంట్లు ఇవ్వకుండా రాష్ట్రప్రభుత్వం బిగపడుతోంది. దీనితో సిబ్బందికి, ప్రత్యేకించి కాంట్రాక్టు కార్మికుల వేతనాలు అందడం లేదు. కాంట్రాక్టర్లకు బిల్లులు అందక అభివృద్ధి పనులు నిలిపివేస్తున్నారు. ఆర్థిక సంక్షోభాన్ని అడ్డం పెట్టి ప్రజలపై పన్నుల భారం వేయడానికి పూనుకుంటున్నారు. మొత్తం మీద సంస్కరణలు మునిసిపాలిటీలను దివాళా తీయించాయి.

**కోకో కోలాకు ప్రభుత్వనీరు...**

90కోట్ల రూపాయల ఖర్చుతో నిర్మించిన మంచినీటిప్రాజెక్టు నుండి కోకో కోలా కంపెనీకి ప్రతిరోజు 50లక్షలలీటర్ల నీరు– సంవత్సరానికి 182 కోట్ల 50లక్షల లీటర్ల మంచినీరు ఇవ్వాలని తెలుగుదేశం పార్టీనేతృత్వంలోని తెనాలి మునిసిపల్ కౌన్సిల్ నిర్ణయించింది. 25లీటర్ల నీరు 3పైసలకే. ప్రజలకు నీరు లేదు. బడాకంపెనీలకు ప్రభుత్వ ఖర్చుతో నీరు అందించడమా? సిగ్గు ! సిగ్గు!!

**కలగా మిగిలిన ఇల్లు**



– పాలకుల విధానాలతో పట్టణాలలో భూములు విలువలు అడ్డు అదుపు లేకుండా పెరిగాయి. గజం స్థలం వేలు, లక్షల రూపాయలు పలుకుతోంది. పేదవాడి సొంత ఇల్లు గురించి కలగనే అవకాశం కూడా లేదు. మధ్యతరగతి ప్రజలు జీవితాంతం కష్టపడినా వ్యక్తిగత ఇల్లు కాదుకదా అపార్ట్‌మెంట్ కొనుక్కోవడం కష్టమైంది. ఇళ్ళ అద్దెలు విపరీతంగా పెరిగాయి. సంపాదనలో సగం అద్దెలకే పోతోంది. ప్రభుత్వ గృహనిర్మాణ పథకాలు నీరుగారిపోతున్నాయి. పథకాల పేర్లు మారుతున్నాయి తప్ప వీసమెత్తు పని జరగడం లేదు. ఇందిరమ్మ ఇళు ్ళ ఆగిపోయాయి. బిల్లులు ఇవ్వడం లేదు. జె.ఎన్.ఎన్.యు.ఆర్.ఎం. పథకంలో కట్టిన ఇళ్ళు తక్కువ. కట్టిన వాటిని కేటాయించలేదు. ఇచ్చిన వాటిలో సౌకర్యాలు లేవు. స్థలం లేదని నిధులుండి కూడా ఇళ్ళు కట్టలేదు. చాలా పట్టణాలలో పట్టాలు చేతికిచ్చినా స్థలం చూపలేదు. కొన్ని చోట్ల స్థలం చూసినా ఇళ్ళు కట్టలేదు. రాజీవ్ గృహకల్ప పథకం అటకెక్కింది. కట్టిన కొద్ది ఇళ్ళు ఊరికి దూరంగా ఉండటంతో నిరుపయోగంగా ఉన్నాయి. సౌకర్యాలు అరకొరే. రాజీవ్ స్వగృహపథకంలో డిపాజిట్లు వసూలు చేసి సంవత్సరాలు గడచినా సమాధానం చెప్పేనాధుడే లేడు. కొత్తప్రభుత్వాలు కొత్త పథకాలలో మళ్ళీ ఊరిస్తున్నారే తప్ప, కథమామూలే.

**అన్నీవున్నా అల్లుడు నోట్లో శని వున్నట్టు...**

**– దేశంలో 2కోట్ల మందికి ఇళ్ళు అవసరం వుందని పాలకులు గుర్తించారు. అందరికీ ఇళ్ళు తమ లక్ష్యమని గొప్పలు చెబుతున్నారు. కానీ పాలకులు తీరు ఎలావుందో చూడండి.**

**– కృష్ణాజిల్లాలో 29వేల మందికి ఇళ్ళు ఇస్తామని పట్టాలు ఇచ్చారు. స్థలం చూపలేదు. పశ్చిమగోదావరి భీమవరంలో 82 ఎకరాలు, పాలకొల్లులో 76 ఎకరాలు ఇళ్ళకొరకు స్థలాలు కేటాయించి సంవత్సరాలు గడిచాయి. స్థలం మెరక చేయకపోవడంతో ఇళ్ళు కట్టలేదు. స్థలం నిరుపయోగంగా పడి వుంది.**

**– ప్రొద్దుటూరు రాజీవ్‌స్వగృహ ఇళ్ళనిర్మాణానికి 60 ఎకరాలు సేకరించారు. లిటిగేషన్‌లతో ఇళ్ళ నిర్మానం జరగడం లేదు. కర్నూల్‌లో 10వేల ఇందిరమ్మ ఇళ్ళపని**

**నిలిచిపోయింది.**

**– విశాఖలో జె.ఎన్.ఎన్.యు.ఆర్.ఎం. ఇళ్ళు కట్టారు. లబ్ధిదారులను నిర్ణయించకపోవడంతో అవి ఖాళీగా వున్నాయి. ఒకే ఇంటిని నలుగురుకి కేటాయించారు మన పాలకులు.**

**– ఇళ్ళు లేని జనం వున్నారు. కాగితాలు ఇచ్చారు. స్థలం లేదు. స్థలం వుంది మెరక లేదు. అన్నీ వున్నా డబ్బు లేదు. డబ్బుండి కట్టినా సౌకర్యాలే లేవు. సౌకర్యాలున్నా లబ్ధిదారులు ఎంపిక జరగలేదు. ఇది ప్రభుత్వాల అందరికీ ఇళ్ళ నిర్వాకం.**

– ఎన్నో ఏళ్ళ నుండి పోరంబోకు స్థలాల్లో జీవిస్తున్నా పట్టాలు లేవు. పట్టాలు లేవని పన్నులు వేయడం లేదు. పన్నులు లేవని కరెంట్, నీటి సౌకర్యం కల్పించడం లేదు. ఇల్లు సరిగా కట్టుకుందామన్నా అప్పు ఇచ్చే నాధుడే లేడు. ఇళ్ళు ఎప్పుడు పీకుతారోనని భయాందోళన మధ్య కాపురం చేస్తున్నారు. క్రమబద్ధీకరణ గురించి టి.డి.పి. ప్రభుత్వం ప్రకటనలే తప్ప పని జరిగింది. లేదు.

– గతంలో పట్టణ గరిష్ట భూ పరిమితి చట్టం (సీలింగ్ చట్టం) అమలులో ఉండేది. సంస్కరణల సాకుతో చట్టం రద్దుచేశారు. ప్రభుత్వం భూమి లేకుండా పెద్దల పరం చేశారు. బడా కంపెనీల రియల్ ఎస్టేట్ వ్యాపారం పెరిగింది. భూములు విలువలకు రెక్కలొచ్చాయి. క్రమంగా ప్రభుత్వం గృహనిర్మాణ బాధ్యత నుండి తప్పుకుని ప్రైవేట్ దయాదాక్షిణ్యాలపై ఆధారపడే దుస్థితి కల్పిస్తున్నారు.

పెరుగుతున్న అసమానతలు– కృంగుతున్న పేదల బతుకులు

– నగరాలు, పట్టణాలలో వెడల్పు చేసిన రోడ్లు, ఆకాశహర్మ్యాలు, అందమైన పార్కులు చూపించి ఇది అభివృద్ధి కాదా ? అని ప్రశ్నిస్తున్నారు. అభివృద్ధి అంటే కొద్ది మంది బాగుపడటం కాదు. ధనికులకు సౌకర్యాలు కల్పించడం కాదు. అత్యధిక మందికి మేలు కలగాలి. అదే నిజమైన అభివృద్ధి. అటువంటి అభివృద్ధి నేడు జరుగుతున్నదా ?

– డబ్బున్న వారికే సౌకర్యాలు, పేదలకు కనీస సదుపాయాలు హుళ్లక్కే. సుందరీకరణ పేరుతో మురికివాడలనే తొలగిస్తున్నారు. ఊరికి దూరంగా తరిమేస్తున్నారు. ఎన్ని మాటలుచెప్పినా మురికి వాడల సంఖ్య పెరుగుతూనే ఉంది. ఆఖరుకు కాలకృత్యాలు తీర్చుకోవడానికి కూడా రుణంలో మరుగుదొడ్లు కట్టుకునే దుస్థితి వచ్చింది. వీధికుళాయిలు తొలగిస్తున్నారు. మంచినీరు కొనుక్కుని తాగుతున్నారు. 24×7 మంచినీటి సరఫరా పేరుతో నీటి మీటర్లు పెట్టి పోష్‌కాలనీలకు నీరిస్తున్నారు. మిగిలిన ప్రాంతాలను విస్మరిస్తున్నారు. చెత్తపన్ను కట్టకపోతే ఆ వీధిలో చెత్త ఎత్తేందుకు కూడా రావడం లేదు. చిరువ్యాపారులను

ఆశీళ్ళ పేరుతో వేదిస్తూ దండుకుంటున్నారు.

- కేంద్ర,రాష్ట్రప్రభుత్వాలు పెద్ద నగరాలకే ప్రాధాన్యత ఇస్తూ నిధులు అక్కడే కుమ్మరిస్తున్నారు. బడా నగరాలలోనే పెట్టుబడులు పెట్టి లాభాలు గుంజుకుంటున్నారు. చిన్న మున్సిపాలిటీలను చిన్న చూపు చూస్తున్నారు. ప్రైవేట్ వారికి తగిన లాభాలు రావని, మున్సిపాలిటీల ఆర్థిక స్థితి బాగోలేదని, పన్నులు సకాలంలో వసూలు కావడం లేదని మెలిక పెట్టి గ్రాంట్లు ఇవ్వడానికి నిరాకరిస్తున్నారు. ప్రభుత్వ పథకాలు పొందటానికి పట్టణాల మధ్య పోటీ పెట్టి పన్నులు బాగా వేసిన నగరాలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. దీనితో వెనుబడిన ప్రాంతాలు, పట్టణాలు మరింత వెనుకబడిపోతున్నాయి.

స్వచ్ఛభారత్ బండారం

**స్వచ్ఛభారత్ అంటూ వ్యక్తిగత మరుగుదొడ్లు కట్టుకోవాలని టీవీలు, పత్రికలు, రేడియోల ద్వారా ఊదరగొడుతున్నారు. నిజమే, బహిరంగ మల విసర్జన సాంఘిక దురాచారమే. కానీ, వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకుంటామని ఒంగోలు కార్పొరేషన్‌లో 3500 కుటుంబాలు దరఖాస్తు చేస్తే 8 మందికి మాత్రమే కట్టించారు. నిబంధనల సాకుతో మరుగుదొడ్ల నిర్మాణానికి అడ్డం పడుతున్నది ప్రభుత్వమే. పట్టా, పన్ను లేకపోతే మరుగుదొడ్డికి శాంక్షన్ రాదు. బాబు-మోది ప్రచారం ఎక్కువ. పని తనం తక్కువ.**

స్థానిక సంస్థల నిర్వీర్యం- ప్రభుత్వాల వైఫల్యం

తెలుగుదేశం పార్టీ ఎన్నికల ప్రణాళికలో పట్టణ ప్రజలకు ఇచ్చిన హామీలు

**- 3 సెంట్లు (144చ॥గజాలు) స్థలంలో ఇల్లు**

**- ఇళ్ళ రిపేర్లకు ఆర్థిక సహాయం**

**- మధ్యతరగతి వర్గాలకు తక్కువ ధరకు అపార్ట్‌మెంట్ల నిర్మాణం**

**- తెల్లకార్డులున్న వారికి 100 రూపాయలకే మంచినీటి కనెక్షన్, ఇతరులకు 1000 రూ॥కు కనెక్షన్**

**- నైట్‌షెల్టర్ల నిర్మాణం**

**- స్మశానాల ఏర్పాటు.**

**- మునిసిపల్ ఆస్తుల పరిరక్షణ**

**- ఉపాధి శిక్షణా కేంద్రాల ఏర్పాటు**

**- అన్న క్యాంటీన్‌ల ఏర్పాటు, 1రూపాయికే ఇడ్లీ, 5 రూపాయలకు భోజనం**

**- బైపాస్‌రోడ్లు, ఫ్లైఓవర్ బ్రిడ్జీలు**

**- వృద్ధాశ్రమాల ఏర్పాటు**

**– 14 నెలలు గడిచినా అమలు ఎక్కడా? కాగితాలకే పరిమితం అయిన వాగ్దానాలు**

– స్థానిక సంస్థలకు అధికారాలు, నిధులు కల్పిస్తూ 73,74 రాజ్యాంగ సవరణలు చేసి రాజ్యాంగ బద్దత కల్పించారు. మునిసిపాలిటీలు సొంత కాళ్ళపై నిలబడాలని పాలకులుహితబోధలు చేస్తూనే స్థానిక సంస్థల కాళ్ళు నరుకుతున్నారు. ప్రజల భాగస్వామ్యం అని తియ్యటి మాటలు చెబుతూ ఎన్నికైన సంస్థలను కాదని పై నుండి పెత్తనం చేస్తున్నారు.

– కేంద్రప్రభుత్వం 13,14 ఆర్థిక సంఘం సిఫార్సుల గ్రాంట్లు ఇవ్వడానికి జె.ఎన్.ఎన్.యు.ఆర్.ఎం., స్మార్‌సిటీలు తదితర పథకాల పేరుతో షరతులు రుద్దుతున్నారు. ఫెడరల్ రాజ్యాంగ స్ఫూర్తికే ఇది విరుద్దం. ప్రపంచబ్యాంకు స్కీమ్‌లు అమలులోనూ ప్రజల అభిప్రాయాలకు, కౌన్సిల్ నిర్ణయాలకు విలువ లేదు. ఏపట్టణంలో ఏమి చేయాలో ఢిల్లీలోనూ, విదేశాల్లోనూ నిర్ణయిస్తున్నారు. ట్రాఫిక్ క్రమబద్దీకరకణకు పరిష్కారాలు, ఆయా పట్టణాలలో చర్చించే నిర్ణయాలు కూడా బి.ఆర్.టి.ఎస్., మెట్రో రైలు వంటి పథకాలు బలవంతంగా రుద్దుతున్నారు. స్థానికంగా పన్నులు ఎంత ఉండాలో నిర్ణయించే అధికారం కౌన్సిళ్ళకు లేకుండా ఆస్తిపన్ను బోర్డును రాష్ట్రప్రభుత్వం ఏర్పాటు చేసింది. మంచినీరు, డ్రైనేజీ, పారిశుధ్యం, తదితర పన్నులు నిర్ణయాలు . విద్యుత్ రెగ్యులేటరీ సంస్థల తరహాలో మునిసిపల్ రెగ్యులేటరీ కమీషన్‌లు ఏర్పాటు చేయబోతున్నారు. స్థానికంగా ఎన్నికైన స్థానిక సంస్థలకు పన్నుల విషయంలో అధికారం ఉంటే తప్పుచేస్తే ప్రజలు నిలదీస్తారు, కాని అధికారాలు తొలగించి ప్రభుత్వం స్థానిక సంస్థలపై పెత్తనం చేస్తోంది. దీనితో ప్రజలకు అడిగే హక్కు లేకుండా పోతున్నది. స్థానిక సంస్థలను ఉత్సవ విగ్రహాలుగా మార్చేస్తున్నారు. సంస్కరణలు వికేంద్రీకరణ స్ఫూర్తికి విఘాతం కల్గిస్తున్నాయి. ప్రజాస్వామ్యానికే ప్రమాదకరంగా పరిణమిస్తున్నాయి.




సంక్షేమ పథకాల వడపోత– ప్రజాపంపిణీ ఎగవేత

– వృద్దాప్య, వితంతు, వికలాంగుల పెన్షన్లు వెయ్యిరూపాయలకు పెంచి ఎంతోమంది పింఛన్లు రద్దు చేశారు. పింఛన్ల పంపిణీ అస్తవ్యస్తం అయ్యింది. కొత్త పింఛన్లు దక్కడం లేదు. డ్వాక్రాగ్రూపుల రుణమాఫీ

వాగ్ధానం అమలు కాలేదు. గ్రూపుకు రూ॥30వేలు వేసినా వాడుకునే అవకాశం లేదు. స్వయంఉపాధి, ఎస్సీ,ఎస్టీ, బి.సి.,మైనారిటీ పథకాలు కాగితాలకే పరిమితం అయ్యాయి. మునిసిపాలిటీలోని అర్బన్ కమ్యూనిటీ విభాగాలు నత్తనడక నడుస్తున్నాయి. జన్మభూమి కమిటీలు వేసి పచ్చచొక్కాల వారికే పథకాలు అందిస్తున్నారు. అర్హులకు మొండిచెయ్యి చూపిస్తున్నారు.

– రేషన్ డిపోలలో కొన్ని జిల్లాలలో ఈ పోస్ విధానం పేరుతో వేలిముద్రలు పెట్టి వేలాదిమంది రేషన్ నిలిపి వేశారు. అన్ని పథకాలకు ఆధార్‌కార్డు లింక్ పెట్టి నానా ఇబ్బందులు పెడుతున్నారు. పామాయిల్ సరఫరా లేదు. కందిపప్పు సంవత్సరం నుండి ఆపి ఈ నెలే ఇచ్చారు. పిల్లలు పెద్దవారైనా వారి పేర్లు కార్డులలో కలపలేదు. కొత్త కార్డుల దరఖాస్తులు పరిశీలనలోనే ఆగిపోయాయి.

– ప్రజలను దొంగలుగా చూస్తూ సంక్షేమ పథకాలకు సవాలక్ష నిబంధనలు,ఆంక్షలు పెడుతున్నారు. పేదలు పనులు పోగొట్టుకుని ఆఫీసుల చుట్టూ తిరగాల్సి వస్తుంది. ఎన్నికల్లోచెప్పిన మాటలు గాలిలో కలిసిపోయాయి.

**కొత్త చట్టాలు– సరికొత్త నిబంధనలు ఎవరికోసం ?**

– విదేశీ బహుళజాతి కంపెనీలు, స్వదేశీ కార్పొరేట్ కంపెనీలు తమ దోపిడీ విస్తరణలో భాగంగా ఇప్పటి వరకు వ్యాపార సరుకులు కాని పౌరసదుపాయాలను ( మంచినీరు, డ్రైనేజీ, పారిశుధ్య నిర్వహణ, లైటింగ్ తదితరములు) వ్యాపార సరుకులుగా మార్చేశారు. గతంలో కాంగ్రెస్ నేడు బిజెపి, టిడిపి ప్రభుత్వాలు స్థానిక సంస్థల ద్వారా పౌరసదుపాయాలు కల్పించడానికి బడ్జెట్‌లో కేటాయించాల్సిన నిధులకు కోతపెట్టి వాటితో పారిశ్రామిక వేత్తలకు రాయితీలు కల్పించటానికి పూనుకుంటున్నారు. దీనికొరకే పట్టణాలలో సంస్కరణలు ప్రవేశపెట్టారు. పట్టణాలలో మౌలిక మార్పులు తెచ్చారు.




– కొత్త విధానాలు వచ్చాయి. పాతరూల్స్, చట్టాలు అడ్డుగా వున్నాయి. అందుకే వాటిని మార్చేస్తున్నారు. భూసీలింగ్ చట్టం ఎత్తివేసిశతకోటీశ్వర్లకు లైన్ క్లియర్ చేశారు.

రిజి[స్ట్రేషన్‌లు, స్టాంప్‌డ్యూటీ తగ్గించాలని ప్రపంచబ్యాంకు హుకుం జారీ చేస్తే 13 శాతం నుండి 6 శాతానికి తగ్గించారు. పన్ను శాతం తగ్గినా ప్రజలపై భారం తగ్గలేదు. భూముల విలువ పెంచేశారు. స్టాంప్ డ్యూటీలో మునిసిపాలిటీలకు ఇవ్వవలసిన వాటాలో కోతపెట్టారు. మునిసిపాలిటీల ఖజానాకు చిల్లు పెట్టి ప్రభుత్వ ఖజానా నింపుకున్నారు. రియల్ ఎస్టేట్ కంపెనీలకు రాచమార్గం చూపారు. భవననిర్మాణ నిబంధనలు మార్పులు చేశారు. వందల అపార్ట్‌మెంట్‌లు నిర్మించే బడా బిల్డర్‌లకు నిబంధనలు వరప్రసాదంలా మారాయి. చిన్న ఇల్లు కట్టుకునే సగటు మధ్యతరగతి వారికి నిబంధనల సంకెళ్ళు విధించారు. జి+1 మించి కట్టుకునే అవకాశం లేదు. స్థలం తాకట్టు పెడితే పై అంతస్తుకు అనుమతి ఇస్తారు. పెద్దలకు వరం- సాధారణ ప్రజలకు శాపంగా నిబంధనలు మారాయి. బిల్డింగ్ పీనలైజేషన్ స్కీమ్ (బిపిఎస్) పేరుతో బెదిరించి మరీ ఖజానా నింపుకుటున్నారు. భవన నిర్మాణంలో చిన్న లోపాలకు పెద్ద శిక్షలు విధిస్తున్నారు. డబ్బు కడితే అంతా ఓకే. కట్టకపోతే అంతా తప్పే.

- ఇప్పుడు ఏకంగా మునిసిపల్ చట్టాలనే పూర్తిగా మార్చే పనిలో పాలకులు ఉన్నారు. మోడల్ మునిసిపల్ చట్టాలు రూపొందించారు. ప్రైవేటీకరణకు చట్టబద్ధత కల్పించే కుట్రలు పన్నుతున్నారు. ఫైర్‌పేరుతో పన్ను, జనసమూహం ఒకచోట చేరితే టాక్స్, నదిలో మునిగితే పన్ను, చిన్న తప్పులకు పెద్ద ఫైన్లు ఇలా కొత్త పన్నులకు కత్తులు నూరుతున్నారు. కొత్త చట్టాలు వస్తే కొత్త కష్టాలు తప్పవు.

- ఆస్తిపన్ను పెంచడానికి ఆస్తిపన్ను నిర్ణయించే విధానాన్నే మార్చేస్తున్నారు. ఇప్పటి వరకు అద్దె విలువ ఆధారంగా ఇంటి పన్ను విధిస్తున్నారు. దీనిని మార్చి ఆస్తి(ఇల్లు+స్థలం) విలువ ఆధారంగా పన్ను నిర్ణయించాలని ప్రభుత్వం యోచిస్తోంది. వేగంగా పావులు కదుపుతోంది. దీనితో ఇంటి పన్నులు విపరీతంగా పెరుగుతాయి. ప్రతి సంవత్సరం విలువ ఆధారంగా ఆటోమేటిక్‌గా పన్నులు పెరుగుతాయి. ఇంటి పన్ను పెరగగానే దానిని బట్టి ఇంటి అద్దెలు పెరుగుతాయి.

**కరెంట్ మీటర్లు- నీటిమీటర్లు**

**- 24×7 వార్తా ఛానళ్ళు వచ్చాయి. ఇప్పుడు 24×7 నీటి పథకాలు వస్తున్నాయి. ఏ నిముషంలో మీకు ఎప్పుడు కావాల్సివస్తే అప్పుడు కుళాయి తిప్పితే మునిసిపల్ నీరు వస్తుంది. ఆశ్చర్యం కాదు.. సాధ్యమేనంట... కాని షరతులు వర్తిస్తాయి.**

**- 24గంటలు నీరు ఇస్తే వృధా చేస్తారని ప్రభుత్వం వాదిస్తోంది. అందుకే వృధా అరికట్టాలి, దానికి మార్గం కుళాయిలకు మీటర్లు పెట్టాల్సిందేనంటున్నారు. నీరు వాడితే మీటర్ తిరుగుతుంది. వాడిన లీటర్లబట్టి మీటర్ చూసి నెలకు బిల్లు పంపుతారు. కరెంట్**

**మీటర్లకే చస్తుంటే, నీటి మీటర్లు వస్తే ఎలా బ్రతకాలి.**

**– 24×7 నీరు ఇవ్వడం కొరకు మీటరా ? కాదు మీటరు పెట్టడం కోసం 24గంటల నీళ్ళు ఇస్తున్నారు. ఇది నిజం కాదా?**




**– అందరికీ 24గంటల నీరు ఇవ్వడం మంచిదే. గంటకే దిక్కులేదు. 24గంటలు మరి నీరు ఎక్కడి నుండి ఇస్తారు? అని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.**

**– 24గంటలకు నీరు ఇచ్చినా నీరు వాడితే మీటర్ తిరుగుతుంది. బిల్లు పడుతుంది. కాబట్టి ఇప్పుడు వాడుతున్న నీరు కూడా జనం వాడరు. కాబట్టి నీటికి మీటర్లు వుండాలని పాలకులు సెలవిస్తున్నారు. ఎలా వుంది పాలకుల తెలివి? నీటి వ్యాపారం అంటే ఇదే.**

పన్నులు పెంచకపోతే పనులు జరగవా? వేరే దారిలేదా ?

– మునిసిపాలిటీలు దివాళా తీశాయి. జీతాలకు కష్టంగా ఉంది. పని జరగాలంటే, అభివృద్ధి సాగాలంటే పన్నులు పెంచక తప్పదు అంటూ పదే పదే పాలక నేతలు చెప్పే మాటలు రోజూ వింటుంటాము. ఇది నిజమా? వేరే పరిష్కారం లేదా? పన్నులు పెంచక తప్పదా ?

– మున్సిపాలిటీలు ఏం పనులు చేయాలో భారత రాజ్యాంగం 12 వ షెడ్యూల్‌లో స్పష్టంగా ఉంది. ఆ విధులను నిర్వహించడానికి నిధులు కావాలి. ఆ నిధులను ఎలా సమకూర్చుకోవాలో భారతరాజ్యాంగమే ఆర్టికల్ 243 ఎ లో స్పష్టం చేసింది. ఈ ఆర్టికల్ ప్రకారం దేశంలో ప్రతి రాష్ట్రం రాష్ట్ర ఆర్థిక సంఘాన్ని నియమించాలి. రాష్ట్ర ప్రభుత్వం తన ఆదాయంలో ఎంత వాటా స్థానిక సంస్థలకు ఇవ్వాలి అన్నది తేల్చి చెప్పటమే రాష్ట్ర ఆర్థిక సంఘం యొక్క ముఖ్య విధి. ఈ ఆర్టికల్‌ను పొందుపరచటం ద్వారా రాష్ట్ర ప్రభుత్వాలు తన ఆదాయంలో స్థానిక సంస్థలకు వాటా ఖచ్చితంగా ఇవ్వాలని రాజ్యాంగం నిర్దేశించింది. కనక రాష్ట్ర ప్రభుత్వాలు తన ఆదాయంలో స్థానిక సంస్థలకు ఇచ్చే వాటా అత్యంత ప్రధానమైనది.




**పెళ్ళిచేసుకుంటే పన్ను..!**

**– జుట్టు పై పన్ను వేశారని చరిత్రలో విన్నాము. కాని పెళ్ళిచేసుకుంటే పన్ను గురించి వినలేదు. ఇప్పుడే వింటున్నాము. విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్‌లో కళ్యాణమండపంలో పెళ్ళి చేసుకుంటే కళ్యాణమండపం అద్దెతో పాటు మునిసిపాలిటీ వారికి పన్ను కట్టాలి. పెళ్ళేకాదు. చచ్చిపోయి దినం చేసుకున్నా కట్టాల్సిందే. ఎందుకంటారా? పెళ్ళి మీరు చేసుకున్నారు. భోజనాలు మీరు పెట్టుకున్నారు. విస్తరాకులు మీరు ఎత్తుకున్నారు. కాని చెత్తకుండీ నుండి ఎవరు తీసుకెళ్ళాలి ? మునిసిపాలిటీ**

**వాళ్ళు ఎత్తాలి. కాబట్టి ఎంగిలి విస్తర్లు తొలగించాలంటే పెళ్ళికి పన్ను కట్టక తప్పదన్నారు మన పాలకులు. అధునాతన తుగ్లక్‌లుగా వున్నారు. జర జాగ్రత్త!**

– మరోవిషయమేమంటే ప్రపంచంలో అభివృద్ధి చెందిన దేశాలలో పన్నులలో గణనీయమైన భాగం స్థానికావసరాల మీద ఖర్చు చేస్తున్నారు. అందుకే వారి పట్టణాలు, పట్టణ ప్రజల జీవన ప్రమాణాలు అభివృద్ధి చెందాయి. అలా గణనీయమైన భాగం స్థానికావసరాల మీద ఖర్చు చేయనందువలననే మన పట్టణాలు ఆ స్థాయికి ఎదగ లేక పోతున్నాయి.

– ప్రజలందరూ ప్రత్యక్షంగా, పరోక్షంగా అనేక పన్నులు కడుతున్నారు. ప్రతి వస్తువు మీద తయారు చేసిన పరిశ్రమలలోనే ఎక్సైజ్ పన్ను కేంద్రం వసూలు చేస్తున్నది. రాష్ట్రప్రభుత్వం వాట్ పేరుతో ఉప్పుమీద, పప్పుమీద, పెట్రోల్, డీజిల్ మీద ఒకటేమిటి సరుకులన్నింటి మీద పన్నులు బాదుతోంది. ఈ పన్నులన్నీ ఏమవుతున్నాయి?

– కేంద్రం పన్నుల నుండి రాష్ట్రాలకు వాటా రావాలి. రాష్ట్రప్రభుత్వ పన్నుల నుండి 39శాతం నిధులు స్థానిక సంస్థలకు బదలాయించాలని రాజ్యాంగబద్ధంగా నియమించిన

రాష్ట్రఆర్థిక సంఘం సిఫార్సులు చేసింది. అయినా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. ఆయా పట్టణాలలో వసూలు చేసి మోటార్ వెహికల్, బ్రాందీషాపుల నుండి వచ్చే ఎక్సైజ్‌పన్ను, ప్రతి సరుకుపై వేసే వ్యాట్‌టాక్స్, మైనింగ్ ఇలా అన్ని పన్నులోనూ స్థానిక సంస్థలకు వాటా రావాలి. ఇవన్నీ ఇవ్వకుండా మునిసిపాలిటీలలో వచ్చే పన్నులతోనే పనులు జరగాలని చెప్పడం మోసపూరితం. కేంద్రం, రాష్ట్రం నుండి నిధులు పొందడం మునిసిపాలిటీల హక్కు. ఎవరి దయాదాక్షిణ్యం కాదు. ఈ వాటా ఇస్తే పన్నులు పెంచాల్సిన అవసరం లేదు. దీనిని మరుగుపర్చి ఆస్తిపన్ను ప్రధాన ఆదాయ వనరుగా చేయాలని చూడటం పెద్ద కుట్ర.

– అంతే కాదు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల కార్యాలయాలు, సంస్థలు మునిసిపాలిటీలకు ఆస్తిపన్ను, నీటిచార్జీలు ఇతర పన్నులు చట్టప్రకారం కట్టాల్సిందే. రైల్వేలు, కేంద్రవిద్యాసంస్థలు ఇప్పటివరకు నయాపైసా పన్ను చెల్లించలేదు. రాష్ట్రప్రభుత్వ సంస్థలు పన్నులు ఎప్పుడో నిలిపివేశారు. అప్పుడప్పుడు కడుతున్నారు. ప్రజలందరికీ పన్నులు పెంచి ప్రభుత్వ సంస్థలకు పన్నులు పెంచరు. కట్టినా పాత పన్నులే కడతారు. మునిసిపాలిటీల నుండి మాత్రం కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని రకాల పన్నులు వసూలు చేస్తున్నాయి. సర్వీసులు పొందుతాయి. ఇదేమి న్యాయం? ప్రభుత్వ సంస్థలు మునిసిపాలిటీలకు పన్నులు సకాలంలో కడితే ప్రజలపై పన్నులు పెంచాల్సిన అవసరం వుండదు.

– మరోవైపు సాధారణ ప్రజల ముక్కుపిండి పన్నులు వసూలు చేసే మున్సిపాలిటీలు బడా సంస్థలకు జోలికి పోవడం లేదు. రిలయన్స్, టాటా ఇతరప్రైవేట్ టెలిఫోన్ కంపెనీలు రోడ్లు త్రవ్వి భూగర్భ కేబుల్స్ వేసి ప్రభుత్వ స్థలాలను వాడుకుంటున్నా వారి పై నయాపైసా పన్ను వేయరు. గోతులుపూడ్చడానికి మాత్రమే అరకొర చెల్లిస్తున్నారు. త్రవ్విన రోడ్లు వేయాల్సింది మాత్రం మున్సిపాల్టీలే. పేదవారు రోడ్డుపై అమ్ముకుంటే రోజువారీ ఆశీళ్ళు, లైసెన్సుఫీజులు వసూలు చేసే మునిసిపాలిటీలు బడా కంపెనీలను ఎందుకు వదిలిపెడుతున్నారు ? భూగర్భ కేబుల్స్‌పై పన్ను వేస్తే మునిసిపాలిటీలకు వందల కోట్ల రూపాయలు ఆదాయం వస్తుంది. బడాసంస్థలు చేసేది వ్యాపారమే కానీ, ప్రజాసేవ కాదు కదా మరి ఈప్రభుత్వాలు బడా కంపెనీలకు వత్తాసుగా ఎందుకు నిలుస్తున్నాయి?

– కోటీశ్వరులు పన్నుల బకాయిలుపడినా అధికారులు ప్రేక్షకప్రాత వహిస్తున్నారు. కోర్టు లిటిగేషన్ పేరుతో సంవత్సరాల తరబడి పన్నులు ఎగ్గొడుతున్నారు. అధికారులు, నేతలు పెద్దలకే వత్తాసు పలుకుతున్నారు. సామాన్యులు పన్నులు చెల్లించకపోతే

నీళ్ళు కట్ చేస్తున్నారు. ఇళ్ళకు సీళ్ళు వేస్తున్నారు. ఫైన్లు గుంజుతున్నారు. ఎందుకీ తేడా ?

– ప్రజలనుండి వసూలు చేస్తున్న పన్నులతో మునిసిపాలిటి అధికారులు, పాలకులు దుబారా చేస్తున్నారు. ఆఫీసుల సుందరీకరణ, వాహనాలు, ఏసిలు, ఇలా ఇష్టారాజ్యంగా ఖర్చుపెడుతున్నారు. అవినీతి పెచ్చరిల్లింది. అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంట్రాక్టర్లు కుమ్మక్కై ప్రజాధనం కొల్లగొడుతున్నారు. ప్రభుత్వం విద్యుత్‌చార్జీలు, పెట్రోల్, డీజిల్ ఇతర ధరలు పెంచినప్పుడల్లా ఆ భారం మునిసిపాలిటీలపైనే పడుతున్నది. దుబారా అరికడితే, అవినీతి కట్టడిచేస్తే ప్రజలపై పన్నులు పెంచాల్సిన అవసరం లేదు.

సబ్సిడీల కుదింపు

– మునిసిపాలిటీలలో పౌరసదుపాయాలను వ్యాపార సరుకులుగా మార్చేశారు. ప్రతిపనికి రేటు కట్టి వసూలు చేసే విధానం వచ్చేసింది. దీనితో ప్రజాసౌకర్యాలలో కోత పడింది. ఉచిత వీధికుళాయిలు క్రమంగా తొలగిస్తున్నారు. దీనితో డబ్బు చెల్లించి సొంత కనెక్షన్ తీసుకోవాలి. నెలవారీ చార్జీలు కట్టాలి. స్వచ్ఛమైన నీరు కావాలంటే డబ్బులతో ప్రైవేట్ కంపెనీలు వద్ద కొనుక్కొవలసిందే. ఉచితపార్కింగ్ లేదు. పార్కింగ్ ఫీజు కట్టకతప్పదు. కమ్యూనిటీ హాళ్ళు ,ప్రభుత్వస్కూళ్లల్లో పెళ్ళిళ్ళు, ఫంక్షన్లు చేసుకుంటే చార్జీ చెల్లించాల్సిందే. ఉచితంగా చేసుకునే పాత రోజులు పోయాయి. పార్కుల్లో ప్రవేశానికీ టోల్‌గేట్ ఫీజు కట్టాల్సిందే. ఆఖరుకు కుటుంబ సభ్యుల పేరుతో ఉన్న ఇంటిపన్ను పేరు మార్చాలన్నా లంచం కాకుండా, మునిసిపాలిటీ నిర్ధేశించిన ఫీజు కట్టక తప్పదు. ఇలా ప్రజలకు అందించాల్సిన సేవలు వ్యాపారపరమయ్యాయి.

**పాలఖర్చు– సరుకులఖర్చు– దోమల ఖర్చు?**

**దోమలు బాధలేని పట్టణం ఉందా? దోమలు, ఈగలు సైజుకు మించి అభివృద్ధి చెందాయి. దోమలతో జబ్బులు రావడమే కాదు. కంటిమీద కునుకు ఉండదు. అందుకే ప్రతి ఇంటిలో తిన్నా, తినకపోయినా డబ్బు వున్నా లేకపోయినా దోమల దెబ్బకు తట్టుకోలేక దోమల నివారణకు దోమల చక్రాలు, బ్యాట్‌లు, రీఫిల్స్ ఎన్నో రకాల మందులు వచ్చాయి. కుటుంబంలో కనీసం 3 రూపాయల నుండి 10 రూపాయల వరకు ప్రతిరోజూ దోమల నివారణకు ఖర్చు తప్పదు. నెలకు సగటున 150 రూపాయలు, సంవత్సరానికి 1800 రూపాయల ఖర్చు. విజయవాడ మునిసిపాలిటీ కార్పొరేషన్‌లో 3లక్షల కుటుంబాలు వున్నాయి. దోమల నివారణకు విజయవాడలో జనం ఖర్చు పెట్టేది సంవత్సరానికి 54కోట్ల రూపాయలు. మరి మునిసిపల్ కార్పొరేషన్ ఖర్చుపెట్టేది కోటి రూపాయలు మాత్రమే. జనం పెట్టే ఖర్చులో ఇది 2శాతం మాత్రమే. జనం మున్సిపల్ కార్పొరేషన్‌కు పన్నులు కట్టాలి. దోమల మందులు జనమే కొనుక్కోవాలి. ఇదేమి న్యాయం. దోమల నివారణ బాధ్యతల నుండి ప్రభుత్వాలు**

**తప్పుకుంటున్నాయి. జనంపై ఆ భారం రుద్దుతోంది. దోమలు పుట్టకుండా, పెరగకుండా చర్యలు తీసుకుంటే ప్రజలకు ఈ ఖర్చు ఉండదు కదా!**

**మౌలికరంగాల అభివృద్ధిపై మౌనం**

– మునిసిపల్ పాఠశాలలు శిధిలావస్థలో ఉన్నాయి. టీచర్ల కొరత ఉంది. సౌకర్యాలు అధ్వాన్నం. పర్యవేక్షణ కొరవడుతోంది. ప్రభుత్వ పాఠశాలల అవసరం పెరుగుతున్నా సౌకర్యాలు లేమి వలన ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రభుత్వం ఉద్దేశ్యపూర్వకంగానే ఈ పాఠశాలలను నిర్వీర్యం చేయడానికి ప్రయత్నిస్తున్నాయి. మంత్రి నారాయణ మునిసిపల్ పాఠశాలలో ఐఐటి కోచింగ్ పేరుతో టీచర్లకు తన కార్పొరేట్ విద్యా సంస్థ ద్వారా శిక్షణకు చేసిన ప్రయత్నాలు బెడిసి కొట్టాయి. మునిపల్ స్కూళ్ళను ప్రైవేటీకరించే ప్రమాదం పొంచి వుంది.

– అర్బన్ హెల్త్ సెంటర్లు, ప్రభుత్వ ఆసుపత్రులు దీనావస్థలో వున్నాయి. కొన్ని పట్టణాలలో స్వచ్ఛంద సంస్థలకు అప్పగించారు. నామమాత్రపు నిధులతో అరకొరగా నడుస్తున్నాయి. సిబ్బంది కొరత వేధిస్తోంది. వైద్య ఖర్చులు పెరగడంతో ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక వైద్యకేంద్రాల అవసరం పెరుగుతోంది. పట్టణాలలో మలేరియా, డెంగ్యూ, టైపాయిడ్, అతిసార వంటి జబ్బులు సర్వసాధారణంగా మారాయి. ఇంటింటికీ వెళ్ళి పర్యవేక్షణ చేసే వైద్య సిబ్బంది తగ్గిపోయారు. వైద్యం బాధ్యతల నుండి క్రమంగా మునిసిపాలిటీలు ప్రభుత్వాలు తప్పుకుంటున్నాయి. కార్పొరేట్, ప్రైవేట్ వైద్యంతో ప్రజల జేబులు ఖాళీ అవుతున్నాయి.

– పట్టణాలలో కాలుష్యం పెరుగుతోంది. పరిశ్రమలు, డంపింగ్ యార్డులు, దెబ్బతిన్న రోడ్ల వలన దుమ్మూధూళి, పెరిగిన ట్రాఫిక్‌తో శబ్ధ, వాయుకాలుష్యం, నీటికాలుష్యం రావడంతో ప్రజలు సతమతమవుతున్నారు. అయినా స్థానిక సంస్థలు, ప్రభుత్వాలు కాలుష్యనివారణకు, పర్యావరణ పరిరక్షణకు శ్రద్ధపెట్టలేదు. మొక్కలు నాటే కార్యక్రమం మొక్కుబడిగా సాగుతోంది. మొక్కల సంరక్షణకు వేసే ట్రీగార్డ్స్ ఏర్పాటుకు మునిసిపాలిటీలు వెనుకంజ వేస్తున్నాయి. కాలుష్యం ఫిర్యాదులపై పట్టించుకునే దిక్కు లేకుండా పోయింది.

– ఇళ్ల మధ్య సెల్‌టవర్లు పెట్టి ప్రజారోగ్యానికి హాని కలిగిస్తున్నారు. ప్రజలు ప్రశ్నించినా, అడ్డుకున్నా అధికారులు స్పందించడం లేదు. పైపెచ్చు పోలీసులు నిలదీసిన ప్రజల నోరునొక్కుతున్నారు. యంత్రాంగం, ప్రభుత్వం బడా కంపెనీలకు వత్తాసు పలుకుతోంది. ప్రజాప్రతినిధులు ప్రేక్షకప్రాత వహిస్తున్నారు. సెల్‌టవర్ల ఏర్పాటు చేసే ప్రాంతాల్లో ప్రజల అభ్యంతరాలు వుంటే టవర్లు పెట్టరాదనే నిబంధనలు ఎత్తివేశారు. 4జి పేరుతో రిలయన్స్ కంపెనీకి యదేచ్ఛగా ప్రభుత్వ అండతో అనుమతులు ఇచ్చేస్తున్నారు.

– పట్టణాలలో ట్రాఫిక్ రద్దీ పెరిగింది. వాహనాల సంఖ్య పెరిగింది. ప్రజారవాణా (ఆర్.టి.సి.బస్సులు) తగ్గింది. ట్రాఫిక్‌జామ్‌లు నిత్యకృత్యమయ్యాయి. రవాణా సమయం పెరిగిపోయింది. రైల్వేగేట్లు ఉన్న చోట ఫ్లైఓవర్లు ఏర్పాటు వాగ్ధానాలు అమలు కావడం లేదు. బైపాస్‌రోడ్లు ఆచరణ రూపం దాల్చడం లేదు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు దీర్ఘకాలిక వ్యూహం మునిసిపాలిటీలు, ప్రభుత్వాలకు లేకపోవడం దురదృష్టకరం.



– అపార్ట్‌మెంట్ కాలనీలలో మధ్యతరగతి ప్రజలు అత్యధికంగా వుంటున్నారు. వీరిపై పన్నులు మాత్రం భారీగా విధిస్తున్నారు. సౌకర్యాలు మాత్రం పట్టించుకోవడం లేదు. భవన నిర్మాణ నిబంధనల పేరుతో అడ్డగోలుగా వేధిస్తున్నారు. రెసిడెంట్ వెల్ఫేర్ అసోషియేషన్లు, కమిటీలను ప్రజాభాగస్వామ్యం పేరు చెప్పి మునిసిపాలిటీలు పన్నుల భారాలు మోపుతున్నాయి. నిర్వహణ బాధ్యతలు వీటిపై వేస్తున్నాయి. ఆ అసోసియేషన్స్ ఫిర్యాదులపై మాత్రం యంత్రాంగం స్పందించడం లేదు. విధాన నిర్ణయాల్లో భాగస్వాములను చేయడం లేదు.

– కొన్ని గ్రామపంచాయితీలను మునిసిపాలిటీలలో చేర్చారు. నగర పంచాయితీలుగా మార్చారు. హోదా పెరిగింది. సౌకర్యాలు పెరగలేదు. పన్నులు మాత్రం పెరుగుతున్నాయి. ప్రభుత్వం వీటికి నిధులు ఇవ్వడంలో అశ్రద్ధ చూపుతుంది.

**పేరుగొప్ప ఊరు దిబ్బ చందం – స్మార్ట్‌సిటీల అందం**

మోడీ–బాబుల జోడి కొత్త సీసాలో పాతసారా పోస్తూ ప్రజలను అభివృద్ధి మత్తులో ముంచుతున్నది.

– స్మార్ట్‌సిటీలు, అమృత్ పథకాలు కొత్తవైనా విధానాలు పాతవే. నిబంధనలు మరింత ప్రమాదకరంగా వున్నాయి. ఈ పథకాలు వస్తే పట్టణాలు రూపురేఖలు మారిపోతాయని ఆశలుగొల్పుతున్నారు. రాష్ట్రంలో 3 నగరాలలో (విశాఖ, తిరుపతి, కాకినాడ) స్మార్ట్‌సిటీలుగానూ, మరొక 31 పట్టణాలు అమృత్ పథకంలోనూ ఎంపిక చేశారు.

– ఎంపికకే పట్టణాల మధ్యపోటీ పెట్టారు. మార్కులు వేశారు. పన్నులు ఎంత ఎక్కువ వుంటే అంత ప్రాధాన్యత. కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టిన జె.ఎన్.ఎన్.యు.ఆర్.ఎం. విషమ షరతులు ఎంత బాగా అమలు చేస్తే అన్ని మార్కులు ఎక్కువ. ఇలా ఎంపికే లోపభూయిష్టంగా ఉంది.



– స్మార్ట్ నగరాలను స్వర్గధామం చేస్తామంటున్నారు. పాలకులు స్మార్ట్, జనం స్మార్ట్, సౌకర్యాలు స్మార్ట్ అంటూ ఊరిస్తున్నారు. ప్రశాంత జీవనంలో సాంకేతిక నైపుణ్యతతో తక్షణ సదుపాయాలు, ఎలక్ట్రానిక్ సెన్సర్లు, పిలిస్తే పలికే యంత్రాంగం, స్మార్ట్ నీటిమీటర్లు, నేరాలనిరోధం, నిరంతర పర్యవేక్షణ ఇలా రంగుల ప్రపంచం మన ముందు వుంచుతున్నారు.

– ఇప్పటి వరకు కొన్ని విభాగాలను ప్రైవేటీకరిస్తూ వస్తున్నారు. స్మార్ట్ నగరాలలో హోల్‌సేల్‌గా మొత్తం ప్రైవేట్‌పరమే. పథకాల అన్నింటా రూపకల్పన మొదలు నిర్వహణ వరకు విదేశీ, స్వదేశీ కార్పొరేట్ సంస్థలదే హవా. నిధులు కొంత వీరే అందిస్తారు. పన్నులు వీరే వసూలు చేసుకుంటారు. ప్రత్యేక సంస్థ (ఎస్.పి.వి) కంపెనీ చట్టం క్రింద రిజిస్ట్రేషన్ చేస్తారు. మునిసిపాలిటీలు, కార్పొరేషన్ల అధికారాలు సర్వం వాటికి ధఖలు పర్చాలి. కంపెనీ సి.ఇ.ఓ మొత్తం చక్రం తిప్పుతారు. ఖర్చుమొత్తం ప్రజల నుండి రాబడతారు. ఇది స్మార్ట్‌సిటీల నిజస్వరూపం.

– స్మార్ట్ సిటీలకోసం కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాల ప్రకారం మున్సిపల్ కార్పొరేషన్ చేసే వివిధ పనులను నిర్వహించటం కోసం కంపెనీ ఏర్పాటుచేస్తారు. ఈ కంపెనీని 2013 కంపెనీ చట్టం ప్రకారం ఏర్పాటు చేస్తారు. ఈ కంపెనీలు షేర్లు అమ్ముకోవచ్చు. ఈ కంపెనీలే నగరంలో పనులను నిర్వహిస్తాయి. పనులు నిర్వహించటమే కాదు. ఆ పనులకయ్యే ఖర్చును పూర్తిగా నగర ప్రజలనుండే వసూలు చేస్తాయి. ఇకమీదట కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నగరంలో అభివృద్ధి పనులకు నిధులు ఇవ్వవు. పెట్టుబడులు ఈ కంపెనీలే పెడతాయి . పన్నులు ఈ కంపెనీలే వసూలు చేసుకుంటాయి. కంపెనీకి లాభాలు

రావాలి. షేరు హోల్డర్లకు లాభాలు పంచాలి. వీళ్లందరకూ సరిపడా లాభాలు పన్నులు, యూజర్ చార్జీల రూపంలో నగర ప్రజలనుండే దండుకుంటారన్నమాట.

మున్సిపల్ చట్ట ప్రకారం ఈ పనులన్నీ మున్సిపల్ కార్పొరేషన్ చేయాలి. కాని ఆపనులను కంపెనీ చేయాలంటే చట్టం అడ్డు వస్తుంది. ఈ అడ్డు తొలగించుకోవటం కోసం స్మార్ట్ సిటీ ప్రాజెక్టులో 4 నిబంధనలను పొందుపరిచారు.

1) స్మార్ట్ సిటీ ప్రాజెక్టు కు సంబంధించిన పనులకు సంబంధించి మున్సిపల్ కౌన్సిల్‌కు ఉన్న హక్కులు, బాధ్యతలు ఆకంపెనీకి బదలాయించాలి.

2) మున్సిపల్ చట్టప్రకారం మున్సిపల్ కార్పొరేషన్‌కు ఉన్న నిర్ణయాలు చేసే హక్కును ఆ కంపెనీకి బదలాయించాలి.

3) పట్టణాభివృద్ధి శాఖకు ఉన్న నిర్ణయం చేసేహక్కు ,ఆమోదించే హక్కులను ఆకంపెనీల బోర్డు డైరక్టెర్లకు బదలాయించాలి.

4) రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం అవసరమైన విషయాలలో, ఆమోదించే హక్కును రాష్ట్ర ప్రభుత్వాన్నుండి ఈ స్మార్ట్ సిటీలకోసం ఏర్పడే రాష్ట్ర స్థాయి హైపవర్ స్టీరింగ్ కమిటీకి బదలాయించాలి.

ఈ పథకంలో చేరికతో నగరపాలనకు సంబంధించి కౌన్సిల్, మున్సిపల్ డిపార్టుమెంటు, రాష్ట్ర ప్రభుత్వం తన హక్కులను పూర్తిగా కోల్పోతాయి. కార్పొరేషన్ ఇక చేయగలిగింది ఏముండదు.ఎన్నికైన కౌన్సిల్ ఏపని చేయాలన్నా కంపెనీల దయాదాక్షిణ్యాలమీదనే ఆధారపడాల్సి వస్తుంది. ఏపని కావాలన్నా మున్సిపల్ అధికారులు కూడా ఆ కంపెనీలమీదనే ఆధారపడాలి.

ఈ పథకంలో చేరితే కంపెనీ కి కార్పస్ ఫండ్‌గా మాత్రమే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కొంత నిధులను విడుదల చేస్తాయి తప్ప పట్టణ అవసరాలకు నిధులివ్వవు. ప్రతిపనీ నగరప్రజలు కంపెనీలకు డబ్బులిచ్చి చేయించుకోవలసిందే. పట్టణ ప్రజలమీద విపరీతంగా భారాలు పడతాయి. పట్టణ ప్రజలు నిలువు దోపిడీకి గురవుతారు. చివరకు పట్టణ పాలనే అస్తవ్యస్తంగా మారుతుంది. ఈ స్మార్ట్ సిటీ పథకాన్ని ఆమోదిస్తే పట్టణాల పరిస్థితి మరింత దిగజారుతుంది. నగర ప్రజలు ప్రజాతంత్ర హక్కులను కోల్పోతారు. కంపెనీల పాలన మొదలవుతుంది.

– స్మార్ట్‌నగరాలలో పేదలు, సామాన్యులకు స్థానం ఉండదు. డబ్బు ఉంటేనే సేవలు. స్థానిక సంస్థలకు అధికారాలు ఉండవు. ప్రజలకు అడిగే హక్కు ఉండదు. రాజధాని అమరావతి దీనికొక తార్కాణంగా కనబడుతోంది. కార్పొరేట్‌పాలన, కంపెనీల పాలన తప్ప మరొకటి కాదు.

– రాష్ట్రప్రభుత్వం రాజధాని పేరుతో వేగంగా పావులు కదుపుతోంది. సింగపూర్, జపాన్ కంపెనీలకు 99 సంవత్సరాల పాటు రాజధానిలో సమీకరించిన భూములను లీజుకు ఇవ్వడానికి జీవో 110 విడుదల చేసింది. వారే నిర్మిస్తారు, వారే పాలిస్తారు. ఇతర పట్టణాలలోనూ క్రమంగా ప్రైవేట్ తంత్రం నడుపుతున్నారు. పారిశుద్య నిర్వహణను సింగపూర్ సంస్థకు ఇస్తోంది. 1,50,000 డాలర్లు కంపెనీకి సలహాలకు ఫీజు చెల్లించారు. గ్రీనరీ, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ ఏర్పర్చారు. దాని ద్వారా మునిసిపాలిటీలను ప్రైవేట్‌వారికి కట్టబెట్టేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఎన్.టి.ఆర్ సుజల సుఫల పథకం ద్వారా ప్రభుత్వ స్థలాల్లో ప్రైవేట్ సంస్థలు ప్లాంట్లు పెట్టి నీళ్ళు అమ్ముకునే అవకాశం కల్పించారు. ఇలా ప్రజావ్యతిరేక సంస్కరణల వేగం పుంజుకుంటున్నాయి.

స్పందించాలి– ఉద్యమించాలి.

– పరిశ్రమలలో, సంస్థలలో కార్మికులు, ఉద్యోగుల శ్రమను పారిశ్రామిక వేత్తలు దోపిడీ చేస్తున్నారు. ఇప్పుడు నివాసప్రదేశాలలోనూ, ఇంటిలోనూ దోపిడీ కొత్త రూపాలలో సాగుతోంది. స్థలాల విలువలు పెరగడం, మంచినీరు, ఇతర సౌకర్యాలు ప్రైవేట్‌పరం కావడం, ప్రభుత్వం స్థానిక సంస్థలు వివిధ రకాల పన్నుల భారాలతో ప్రజలను పీల్చిపిప్పి చేస్తున్నారు. అందుకే పని ప్రదేశాలలోనూ, నివాసప్రాంతాలలోనూ ప్రజాపోరాటాలు సాగాలి. వీటిని సమన్వయ పరచాలి.

– మునిసిపాలిటీలో ఎన్నికైన కౌన్సిళ్ళలో ప్రజాప్రతినిధులు అత్యధిక మంది ప్రజాసమస్యలను గాలికొదిలేస్తున్నారు. స్వంత ప్రయోజనాలు చూసుకుంటున్నారు. కౌన్సిళ్ళలో ప్రజాసమస్యలపై కనీస చర్చ ఉండటం లేదు.

– కౌన్సిళ్ళలో ఎన్నికైన ప్రధానపార్టీలు ఎవరైనా ఒకే తీరులో పాలన సాగుతున్నది.

– ఈ నేపథ్యంలో పౌరసమాజం బాధ్యత పెరిగింది. సమస్యలు పెరుగుతున్నాయి. స్పందించాల్సిన అవసరం పెరిగింది. మురికివాడలు, అపార్ట్‌మెంట్‌లు, కాలనీల అసోసియేషన్‌ల సంస్థలు ఏర్పడాలి. సమస్యలపై ప్రజలను కూడగట్టాలి. వాటిపై ఉద్యమించాలి.

రోజువారీ సమస్యలపై పోరాడాలి. కష్టాలకు కారణమవుతున్న విధానాలపై దీర్ఘకాలికి ఉ ద్యమాలు సాగాలి.

– పట్టణాలలో సకల సమస్యలకు కారణం పాలకుల విధానాలు. 25 సంవత్సరాల కాలం నుండి కొనసాగుతున్న సంస్కరణలు ప్రజల కష్టాలు పెంచాయి. మునిసిపాలిటీలను దిగజార్చాయి. ప్రమాదం మరింత పెరిగింది. పాలకులు మారినా విధానాలు మారడం లేదు. అందుకే తక్షణ సమస్యల పరిష్కారానికై ఉద్యమించాలి. ప్రమాదకర సంస్కరణలపై సమరం సాగించాలి. ప్రజల హక్కులను కాపాడాలి. ప్రత్యామ్నాయ విధానాలకై పోరాడాలి. ఇదే మార్గం. దానికి కలసి రావాలని సిపియం పట్టణ పౌరులకు విజ్ఞప్తి చేస్తున్నది.

***

## కోర్కెలు

(1) స్థానిక సంస్థలకు రాష్ట్రబడ్జెట్‌లో 40శాతం నిధులు కేటాయించాలి. – ఫైనాన్స్ కమీషన్ నిధులను తక్షణమే విడుదల చేయాలి.

(2) నిలిచిపోయిన ఇందిరమ్మ ఇళ్ళు, జె.ఎన్.ఎన్.యు.ఆర్.ఎం. తదితర పథకాల ఇళ్ళు పూర్తి చేయాలి. పెండింగ్ బిల్లులు చెల్లించాలి. పట్టాఇచ్చిన వారందరికీ స్థలం చూపాలి. స్థలం ఉన్నచోట్ల నిర్మాణానికి నిధులు ఇవ్వాలి.

– పోరంబోకు, కొండ తదితర ప్రాంతాలలో నివాసం వుంటున్న వారికి 125 చదరపు గజాలకు ఉచితంగా పట్టాలు ఇవ్వాలి. రిజస్ట్రేషన్‌లు చేయాలి. గతంలో పట్టాలు ఉన్న వాటికి రిజిస్ట్రేషన్లు చేయాలి. అర్హులందికీ ఇళ్ళు ఇవ్వాలి.

– పౌరసౌకర్యాలపై ఇచ్చిన హామీలు అమలు చేయాలి.

(3) ప్రజారోగ్య మెరుగుదలకు చర్యలు చేపట్టాలి. పారిశుద్యం మెరుగుపర్చాలి. ప్రతి

పట్టణానికి డంపింగ్ యార్డులు ఏర్పాటు చేయాలి. ప్రతి పదివేల జనాభాకు పట్టణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఏర్పర్చాలి.

- పట్టణ ఆరోగ్యకేంద్రాలలో సౌకర్యాలు మెరుగుపర్చాలి. స్థానిక సంస్థలే ఆసుపత్రులు నిర్వహించాలి. సిబ్బందిని పెంచాలి.

(4) పెంచిన పన్నుల భారాలు తగ్గించాలి.

(5) పేదల ఇళ్ళకు ఉచిత మంచినీటి కనెక్షన్ ఇవ్వాలి. నెలవారీ చార్జీ 25 రూపాయలు మాత్రమే వసూలు చేయాలి. భూగర్భ డ్రైనేజీ కనెక్షన్లు ఉచితంగా ఇవ్వాలి. నెలవారీ చార్జీలు రద్దు చేయాలి.

- బి.పి.ఎస్. పథకంలో పేదలకు పూర్తిగా రుసుం మినహాయించాలి. ఉచితంగా క్రమబద్ధీకరించాలి. బి.పి.ఎస్. కాలపరిమితి పెంచాలి.

- ఎల్.ఇ.డి బల్బులు ఏర్పాటు పేరుతో వీధిలైట్లు ప్రైవేటీకరణకరణ చేసే జి.వో. 74రద్దు చేయాలి. స్థానిక సంస్థలే వీధిలైట్లు నిర్వహణ చేయాలి.

(6) నిబంధనల ప్రకారం మునిసిపల్ బడ్జెట్‌లో 40శాతం నిధులు మురికివాడల అభివృద్ధికి కేటాయించాలి. వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాన్ని చేపట్టాలి. పనులు వేగవంతం చేయాలి. పట్టాలు లేకపోయినా మరుగుదొడ్లు కట్టాలి.

(7) స్మార్ట్‌సిటీలు, అమృత్ పథకాలలోని ప్రమాదకర షరతులను తొలగించి కేంద్రం గ్రాంట్లు ఇవ్వాలి.

- మున్సిపాలిటీలలో ఖాళీగా వున్న అధికారులు, సిబ్బంది పోస్టులను భర్తీ చేయాలి.

- జన్మభూమి కమిటీలను రద్దు చేసి అఖిలపక్ష కమిటీలను నియమించాలి. సంక్షేమ పథకాలలో లబ్ధిదారులను పారదర్శకంగా గుర్తించాలి.

(8) ఆస్తిపన్ను బోర్డు రద్దు చేయాలి. పన్నులు నిర్ణయించే అధికారం ఎన్నికైన కౌన్సిళ్ళకే ఉండాలి. బడా కంపెనీలు వేసే భూగర్భకేబుల్స్ పై పన్ను విధించాలి. కేంద్ర, రాష్ట్రప్రభుత్వ సంస్థలు ఆస్తిపన్ను, ఇతర పన్ను బకాయిలు చెల్లించాలి.

(9) పొదుపు సంఘాలకు లక్షరూపాయలు రుణమాఫీ ఒకేసారి చేయాలి. వ్యక్తిగత ఖాతాలో డబ్బు వేయాలి. ఎస్సీ,ఎస్టీ, బి.సి, మైనారిటీ, స్వయం ఉపాధి పథకాలకు నిధులు ఇవ్వాలి. లబ్ధిదారులను పారదర్శకంగా గుర్తించాలి.

(10) మునిసిపాలిటీ పాఠశాలలో టీచర్ల పోస్టులను భర్తీ చేయాలి. సౌకర్యాల కల్పనకు నిధులు కేటాయించాలి.

(11) కొత్తరేషన్ కార్డులు ఇవ్వాలి. పాత కార్డులలో కుటుంబసభ్యుల పేర్లు కలపాలి. రద్దు చేసిన సరుకులు పునరుద్దరించాలి. ఈపోస్, ఆధార్‌పేరుతో నిలిపివేసిన రేషన్ పునరుద్దరించాలి.

(12) అర్హులందరికీ వృద్ధాప్య, వితంతు, వికలాంగుల పెన్షన్‌లు ఇవ్వాలి. రద్దు చేసిన పింఛన్లు పునరుద్ధరించాలి.

* * *

వెల రూ. 3/-

సిపిఐ(ఎం) రాష్ట్ర కమిటీ కార్యాలయం, 27-13-3, ఆకుల వారి వీధి, గవర్నర్‌పేట విజయవాడ - 2
ఫోన్ నెం. 0866 - 2577202, ప్రచురణ కర్త: పి.మధు, రాష్ట్ర కార్యదర్శి, సిపిఐ(ఎం) పార్టీ, ఆంధ్రప్రదేశ్